క్లుప్తంగా

8 నుంచి వేంకటేశ్వరుని తీర్థ మహోత్సవాలు



అలివేలు మంగ పద్మావతి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి

రాజానగరం: రావుల చెరువు గట్టున ఉన్న అలివేలు మంగ పద్మావతి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి తీర్థ మహోత్సవాలు ఈ నెల 8 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆరోజు రాత్రి 7.35కు కల్యాణోత్సవం జరుగుతుంది. కోలాట ప్రదర్శన, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. శనివారం అఖండ అన్న సమారాధన చేసి, ఆఖరి రోజైన సోమవారం రాత్రి రావుల చెరువులో జరిగే పుష్పయాగంతో ఐదు రోజుల ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా అమ్మవారి జాతర

కోరుకొండ: శ్రీరంగపట్నంలోని పందుళ్లమ్మవారి జాతర మహోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు 400 మంది మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు.

మిగులు ధాన్యం కొనుగోలు చేయాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

రాజానగరం: నియోజకవర్గంలోని కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లో రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పెద్దఎత్తున ధాన్యం కొనుగోళ్లు జరిగాయని, కొన్ని ప్రాంతాల్లో ఇంకా రైతుల వద్ద కొంతమేర ధాన్యం మిగిలి ఉందన్నారు. దానిని కూడా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సోమవారం కాకినాడలో మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశామని ఎమ్మెల్యే ఇక్కడి విలేకరులకు తెలిపారు. గ్రామాల వారీగా ఉన్న ధాన్యం నిల్వల వివరాలను మంత్రికి అందజేశామన్నారు.

బాధితుల సమస్యలు తక్షణం పరిష్కరించాలి

పెదపూడి: దోమాడ గ్రామంలో ఇళ్లు కోల్పోయిన బాధితుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని పలు ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దోమాడ గ్రామంలో సోమవారం ఆంధ్ర మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు, జైభీమ్ భారత్ పార్టీ రాజకీయ వ్యవహారాల చైర్మన్ వేణుగుపల్లి కృష్ణ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ సభ్యుడు గుబ్బల ఆదినారాయణ, ఆంధ్ర మాలమహానాడు రాష్ట్ర యువజన సంఘం నాయకుడు ఉల్లం రవి, లింగం నానిబాబు, మోకన అన్నవరం, అరట్లకట్ట గాంధీ తదితరులు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగే వరకు ఉద్యమం విరమించేదిలేదని స్పష్టం చేశారు.

భారీ అన్న సమారాధన



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

కోరుకొండ: జంభూపట్నంలోని ఉమా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ధర్మకర్త ఉల్లి పట్టాభి ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై, స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులు ఉల్లి సుబ్బన్న కాపు, వీరపార్వతి దంపతులు శివాలయానికి రూ.10 వేల విరాళాన్ని అందజేశారు.

చెక్కుల పంపిణీ

రాజానగరం: అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం జనసేన నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి సోమవారం పంపిణీ చేశారు. సీతానగరం మండలం ముగ్గళ్లకు చెందిన కూచిపూడి ఆనంద్‌కుమార్‌కు రూ.49,578, వెదుళ్లపల్లికి చెందిన తన్నీరు సురేష్‌కు రూ.43,727, కూనవరానికి చెందిన పిండి నాగమణికి రూ.25,541, మిర్తిపాడుకు చెందిన నున్న సుబ్బారావుకు రూ.27,348 ఆర్థిక సాయాన్ని చెక్కుల ద్వారా అందజేశారు.

వ్యర్థాల దహనం.. ప్రకృతి హననం

- విచ్చలవిడిగా పంట అవశేషాల కాల్చివేత
- సారం కోల్పోతున్న భూములు
- అంతరిస్తున్న మిత్ర పురుగులు
- హెచ్చరిస్తున్న వ్యవసాయ నిపుణులు



పెద రాయవరంలో పొలంలోనే గడ్డి తగులబెడుతున్న రైతులు



చంద్రేడులో పొలంలోనే మినుము కాడ దహనం చేస్తున్న రైతులు

రంగంపేట: ఖరీఫ్, రబీ సాగు పూర్తయిన తరువాత పంట అవశేషాలను దహనం చేయడం రైతులకు అలవాటుగా మారింది. ఇలా చేయడం వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించడంతో పాటు, భూమిలో అనేక మార్పులు జరిగి భూసారం కోల్పోయే ప్రమాదం ఉంది. ఫలితంగా పంట దిగుబడులు తగ్గి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. దహనం చేయడానికి బదులు ఈ అవశేషాలను భూమిలో కలియ దున్నడం వల్ల భూసారం పెరిగి, తదుపరి పంటలో అధిక దిగుబడి పొందే అవకాశం ఉంటుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

అనపర్తి నియోజకవర్గంలో బిక్కవోలు, పెదపూడి, అనపర్తి మండలాల్లో ఎక్కువగా వరి, రంగంపేట మండలంలో వరితో పాటు, మొక్కజొన్న, మినుము, శనగ, పొగాకు, మిరప, పత్తి పంటలు సాగు చేస్తుంటారు. ఈ సీజన్‌లో రంగంపేట మండలంలో 2,100 ఎకరాలు, పెదపూడి మండలంలో 16 వేల ఎకరాలు, అనపర్తి మండలంలో 11,500 ఎకరాలు, బిక్కవోలు మండలంలో 12 వేల ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశారు. ఇప్పటికే కోతలు దాదాపు పూర్తి కావచ్చాయి. సుమారు 90 శాతం రైతులు పంట అవశేషాలను పొలాల్లోనే కాల్చివేస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో వరి, మినుము, శనగ పంటలు పూర్తి కావడంతో, ఆయా పంటల అవశేషాలను యథేచ్ఛగా పొలాల్లోనే దహనం చేస్తున్నారు. వ్యవసాయ శాఖాధికారులు పలుమార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది.

కలియదున్నితే మేలు

పంట అవశేషాలను భూమిలో కలియ దున్నడం వల్ల సేంద్రియ కర్బనం పెరిగి రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పూర్వం రైతులు పంట అవశేషాలను భూమిలో కలిదున్నేవారు. దీని ఫలితంగా అవి భూమిలో కుళ్లిపోయి తర్వాత పంటలకు మంచి ఎరువుగా మారేవి. కాలక్రమేణా రైతులు ఈ పద్ధతికి స్వస్తి చెప్పి, పొలంలోనే తగులబెట్టడం అలవాటుగా చేసుకున్నారు. దీనివల్ల రైతులకు తెలియకుండానే భూమికి అనేక విధాలుగా నష్టం కలుగుతోంది. నిప్పు పెట్టడం వల్ల తర్వాత సాగు చేయబోయే పంటలపై దుష్ప్రభావం చూపడమే కాకుండా, వాతావరణ కాలుష్యం, అగ్ని ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి.

తలెత్తే అనర్థాలివే..

- నేల స్వాభావిక లక్షణాలు మారిపోతాయి.
- భూమిలో సేంద్రియ కర్బనం తగ్గిపోతుంది.
- భూసారం తగ్గి పరోక్షంగా దిగుబడులపై ప్రభావం చూపుతుంది.
- నేలలో తేమ శాతం గణనీయంగా తగ్గుతుంది.
- నేలలో ఆమ్ల గుణం తగ్గిపోతుంది.
- పర్యావరణ కాలుష్యం పెరిగి, ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుంది.
- అధిక మోతాదులో రసాయన ఎరువులు వినియోగించాల్సి వస్తుంది. ఫలితంగా నేల సమతుల్యత దెబ్బతింటుంది.
- భూమి పొరల్లో పంటకు, నేలకు మేలు చేసే మిత్ర పురుగులు నశిస్తాయి.

కలియదున్నడం ఉత్తమం



పంట అవశేషాలను రైతులు భూమిలో కలియదున్నాలి. అవశేషాలు కుళ్లిపోయి, ఆ తర్వాత సాగు చేసే పంటకు మంచి ఎరువుగా ఉపయోగపడుతుంది. సేంద్రియ ఎరువుల వల్ల భూసారం పెరిగి, నాణ్యమైన దిగుబడులు లభిస్తాయి. దీనివల్ల ఎరువుల వాడకం, పెట్టుబడులు తగ్గుతాయి. వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించవచ్చు.

– కె.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి, రంగంపేట

ర్యాంపు అనధికార నిర్వహణపై పోలీసులకు ఫిర్యాదు

సీతానగరం: మండలంలోని ముగ్గళ్ల ఇసుక ర్యాంపు అనధికార నిర్వహణపై చర్యలు తీసుకోవాలంటూ అదే గ్రామానికి చెందిన పలువురు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ర్యాంపు అనధికార నిర్వహణ వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామంటూ ఆదివారం చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామంలో ఇసుక డంపింగ్‌లు ఎక్కువయ్యాయని, వీటివల్ల డ్రైనేజీలోకి ఇసుక చేరి మూసుకుపోతున్నాయని, నీరు నిలిచిపోతుందని, రోడ్డుపై ఇసుక వల్ల వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని వివరించారు. పోలీసులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే సింగవరం, ముగ్గళ్ల అనధికార ర్యాంపుల నుంచి అధిక సంఖ్యలో ట్రాక్టర్లపై ఇసుకను తరలిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన అధికార ర్యాంపు వంగలపూడి నుంచి తీసుకువెళ్లాల్సిన ఇసుకను ప్రజాప్రతినిధుల అండదండలతో అనధికార ర్యాంపుల నుంచి ట్రాక్టర్లపై ఇతర మండలాలకు తరలిస్తున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఈఈ జేపీబీ నటరాజన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ కాటవరం సబ్ స్టేషన్ నుంచి కొత్త 11 కేవీ కాటవరం ఫీడర్ లైన్ పనుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. దీంతో కాటవరం, జాలిమూడి గ్రామాలకు మంగళవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఉపాధి కూలీలందరికీ పని కల్పించాలి

ఎంపీడీఓ నరేంద్రరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పెదపూడి: గ్రామీణ ఉపాధిహామీ కూలీలందరికీ పని కల్పించి, గ్రామాల్లో పంట కాలువలు, చెరువుల పనులు చేపట్టాలని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏ, జేఈలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవి కాలం, మరోవైపు వ్యవసాయ మసూళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. నిబంధనల ప్రకారం ఈ పనులు చేపట్టాలన్నారు. పనులు చేసే కూలీల వద్ద తాగునీరు, మెడికల్ కిట్లు తదితర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించి పనులు చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి, ఏపీఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీలో ప్రొటోకాల్ ఉల్లంఘన



దుప్పలపూడిలో పౌష్టికాహార కిట్‌ను అందజేస్తున్న కూటమి నేత సుధాకర్‌రెడ్డి

పెదపూడి: అనపర్తి మండలం దుప్పలపూడి గ్రామంలో ప్రొటోకాల్ రగడ రేగింది. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం కిట్ల పంపిణీకి తనను ఆహ్వానించలేదంటూ ఇన్‌చార్జి సర్పంచ్ వల్లభశెట్టి శివపద్మిని ఆరోపించారు. ఆమె మాట్లాడుతూ, దుప్పలపూడిలో 280–అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం కూటమి నాయకులు ఎం.సుధాకర్‌రెడ్డి, వి.శ్రీను పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారని, ఇన్‌చార్జి సర్పంచ్ అయిన తనను ఆహ్వానించలేదని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి, విచారణ చేపట్టాలని కోరారు. దీనిపై అంగన్‌వాడీ కార్యకర్త వాణిని వివరణ కోరగా, పొరపాటున ఇన్‌చార్జి సర్పంచ్ శివపద్మిని ఆహ్వానించడం మరిచిపోయినట్టు చెప్పారు. సీడీపీఓ జెస్సీ ఫ్లోరెన్స్‌ను వివరణ కోరగా, దీనిపై వివరాలు సేకరించి, ఉన్నతాధికారులకు నివేదిస్తానని సమాధానమిచ్చారు.

ఇద్దరు యువతుల అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు యువతులు అదృశ్యమైనట్టు బొమ్మూరు పోలీసు స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. జిరాక్స్ తీసుకుని వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన తన కుమార్తె తిరిగి ఇంటికి చేరలేదని రాజమండ్రి శాంతిపురానికి చెందిన చొప్ప లోవరాజేశ్వరి సోమవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు, లోవరాజేశ్వరి శాంతిపురంలో అద్దె ఇంట్లో ఉంటూ, తన 17 ఏళ్ల కుమార్తెను చదివించుకుంటోంది. గత నెల 27వ తేదీ సాయంత్రం జిరాక్స్ తీయించుకుని వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన కుమార్తె ఇప్పటి వరకు తిరిగి రాలేదు. శనివారం ఉదయం 6 గంటల సమయంలో సీళ్లడబ్బాపై ఫోన్ పెట్టి ఉందని, తన కుమార్తె ఇంటికి వచ్చి ఫోన్ పెట్టి వెళ్లిపోయిందని భావించి పరిసర ప్రాంతాలు వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. ఎస్సై అంకారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫోన్ తీసుకుని..

ఇంటి నుంచి వెళ్లిన తన కుమార్తె తిరిగి రాలేదని లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన కప్పలకుమారి సోమవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు, హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన 23 ఏళ్ల కప్పల శ్రావణికుమారి పదో తరగతి వరకు చదివి, ఇంటి వద్దే ఉంటోంది. ఆదివారం రాత్రి ఏడు గంటల సమయంలో తల్లి పడుకుని ఉన్నప్పుడు ఫోన్ తీసుకుని వెళ్లిపోయింది. తన ఫోన్ పనిచేయడం లేదని, పరిసర ప్రాంతాలు వెతికినా కుమార్తె ఆచూకీ లభించలేదు. ఎస్సై ఆర్.మురళీమోహన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆవ భూముల్లో అక్రమ సాగు

కలెక్టర్ ఆదేశాలూ బేఖాతరు!



ఆవ భూముల్లో నరికివేసిన జామాయిల్ చెట్లు

కోరుకొండ: ప్రభుత్వ భూముల్లో వేరుశనగ, మొక్కజొన్న అక్రమ సాగుతో పాటు, సహజ సిద్ధంగా పెరిగిన జామాయిల్ చెట్లను అమ్ముకుంటూ కొందరు అక్రమార్జన చేస్తున్నారు. రాజమహేంద్రవరం, రూరల్ నియోజకవర్గాల్లోని పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వడానికి బూరుగుపూడి సమీపంలో 586 ఎకరాల భూములను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొనుగోలు చేసిన సంగతి విదితమే. ఆయా భూ యజమానులకు నగదు చెల్లించడంతో భూములన్నీ ప్రభుత్వపరమయ్యాయి. కాగా కొందరు రాజకీయ నాయకుల అండతో ఈ భూముల్లో అక్రమ సాగుకు ఎగబడ్డారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలను సైతం బేఖాతరు చేసి, ప్రస్తుతం వేరుశనగ, శనగ పంటను సాగు చేస్తున్నారు. రెండు నెలల క్రితం అక్రమ సాగుపై కలెక్టర్‌కు ఫిర్యాదులందగా, ప్రభుత్వ భూములను సంరక్షించాలని అప్పట్లో రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ క్రమంలో తహసీల్దార్ తమ సిబ్బందితో వెళ్లి ఆయా భూములను పరిశీలించారు. అదే సమయంలో అక్రమంగా సాగుచేస్తున్న మొక్కజొన్న పంటను ధ్వంసం చేయించారు. అయినప్పటికీ అక్రమార్జన కోసం కొందరు మళ్లీ సాగు చేపట్టారు.

24 టన్నుల కలప అమ్మకం

సహజసిద్ధంగా పెరిగిన జామాయిల్ చెట్లనూ నరికేసి అక్రమార్కులు అమ్ముకుంటున్నారు. ఇప్పటివరకూ 103 ఎకరాల్లో విస్తరించిన జామాయిల్ చెట్లు నరికేశారు. అదే మొదలుతో పెరుగుతున్న మొక్కలను సైతం నరికి, సొమ్ము చేసుకుంటున్నారు. రెండు నెలలుగా 24 టన్నుల జామాయిల్ కర్రలను విక్రయించినట్టు చెబుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరాలు



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రమేష్‌బాబు

సీతానగరం: రామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి సంయుక్తాధ్వర్యంలో స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో సోమవారం ఉచిత జనరల్, కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆశ్రమంలో డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ సత్యం రమేష్‌బాబు 257 మందికి వైద్య సేవలందించారు. మఠం ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో 189 మందిని పరీక్షించారు. ఉచితంగా మందులను అందించారు. కంటి ఆస్పత్రి వారు నిర్వహించిన శిబిరంలో 68 మందిని పరీక్షించి, 9 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లకు తరలించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ క్యాంప్ ఇన్‌చార్జి స్వామి లోకమయానందాజీ, ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, యన్నమని వెంకట నారాయణ, ఓఎస్ సురేష్‌బాబు, కె.శ్రీనివాస్, చంటిబాబు పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం



ఖైదీలనుద్దేశించి మాట్లాడుతున్న జడ్జి శ్రీలక్ష్మి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకరిస్తుందని ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి అన్నారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారాన్ని సోమవారం ఆమె సందర్శించారు. జైలులో ఆహార ప్రమాణాలు, ఇతర సదుపాయాలను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడారు. వారి తరఫున ఉచితంగా వాదించేందుకు న్యాయవాదులు కావాలన్నా, బెయిల్ పిటిషన్లు, పై కోర్టుల్లో అప్పీలు వేయాలన్నా, మరే ఇతర న్యాయ సహాయం కావాలన్నా తమ సంస్థ సహకారం అందిస్తుందని తెలిపారు. ఎవరైనా ఖైదీలు న్యాయ సహాయం కావాలని అనుకుంటే సంస్థ నియమించిన పారాలీగల్ వలంటీర్ల ద్వారా అర్జీలు అందించాలని సూచించారు. ముద్దాయిలు, ఖైదీల కోసం పని చేస్తున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను వినియోగించుకోవాలని శ్రీలక్ష్మి అన్నారు.

పీజీఆర్‌ఎస్‌లో ఐదు అర్జీలు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐదు అర్జీలు అందాయి. ఎంపీడీఓ ఎం భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో అర్జీలు అందుకున్నారు. రాపాక పంచాయతీ సరిహద్దులను ఏర్పాటు చేయాలని చంద్రు బుజ్జియ్య ఆధ్వర్యంలో స్థానికులు అర్జీని అందించారు. స్థలం ఆక్రమణపై కాటవరానికి చెందిన దిల్‌రాజు ప్రసన్నకుమార్ అర్జీ ఇచ్చారు. కౌలుకు ఇచ్చిన పొలంపై బ్యాంకు రుణం తీసుకున్న కౌలుదారుడు వాయిదాలు చెల్లించడం లేదని మరొకరు అర్జీ అందించారు. సర్వే చేసి పొలం హద్దులు చూపాలని సీతానగరానికి చెందిన మేడిచర్ల అన్నపూర్ణ, ఇంటి స్థలానికి హద్దులు ఏర్పాటు చేయాలని ఇనుగంటివారిపేటకు చెందిన ఆరాధ్యుల వెంకటరామ నాగసాయికుమార్ అర్జీలు సమర్పించారు. డిప్యూటీ ఎంపీడీఓ కేవీఎస్ఎస్ మూర్తి, ఏఓ సుబ్రహ్మణ్యం, వివిధ శాఖల అధికారులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దళిత యువకుల ఆందోళన



బూరుగుపూడిలో దళిత నాయకులతో చర్చిస్తున్న పోలీసులు

కోరుకొండ: బూరుగుపూడి గ్రామంలో దళిత యువకులు సోమవారం రాత్రి రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలుసుకోకుండా కోరుకొండ పోలీస్ స్టేషన్ ఎస్సై కె.నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని ఆరోపిస్తూ వారు ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే, స్థానిక యువకులకు, మరో వర్గానికి మద్యం దుకాణం వద్ద ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో దళిత యువజన నాయకుడు టింకు అరచేతికి గాయమైంది. దీంతో ట్రాక్టర్‌పై వెళుతున్న తన బంధువును రోడ్డుపై ఆపాడు. వారిద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో, ట్రాక్టర్‌ను యజమాని అక్కడే వదిలి వెళ్లిపోయాడు. దీంతో రోడ్డుపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అక్కడున్న గుంపును చెదరగొట్టారు. ఈ క్రమంలో టింకును ఎస్సై నాగరాజు తీవ్రంగా కొట్టారు. దీంతో ఆగ్రహించిన దళిత యువకులు ఆందోళనకు దిగారు. డీఎస్పీ వై.శ్రీకాంత్, ఇన్‌చార్జ్ సీఐ బాలసౌరి, రాజమహేంద్రవరం, కోరుకొండ, గోకవరం, సీతానగరం పోలీస్ స్టేషన్ల సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. రోడ్డుపై బైఠాయించిన ఆందోళనకారులను సముదాయించేందుకు యత్నించారు. పరిస్థితి ఉద్రిక్తతకు దారితీస్తుండడంతో, ఆందోళనకారులను పోలీసులు చెదరగొట్టారు. దళిత యువకుడిని ఎస్సై కొట్టారని, అధికార పార్టీకి చెందిన వారిపై చర్యలు తీసుకోలేదని ఆందోళనకారులు వాపోయారు. డీఎస్పీ శ్రీకాంత్ నిర్వహించిన చర్చల్లో వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా రాంబాబు, బూరుగుపూడి మాజీ ఎంపీటీసీ పిట్టా కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ముందు జాగ్రత్తగా పోలీసులు అక్కడ గస్తీ ఏర్పాటు చేశారు.

సర్కారు తీరు.. రైతు బేజారు

- మారుతున్న వాతావరణ పరిస్థితులతో ఇక్కట్లు
- ధాన్యం కొనేందుకు ప్రభుత్వం నిరాకరణ
- ఆందోళనలో అన్నదాత
- అయినకాడికి కాజేసేందుకు దళారులు సిద్ధం



దుళ్ల గ్రామంలో కళ్లాల్లోనే ఉన్న ధాన్యపు రాశులు

కడియం: అకాల వర్షాలు ఓవైపు రైతులను తరుముతున్నాయి. ఉన్నట్టుండి మారిపోతున్న వాతావరణం ఏ క్షణాన ఎలా ఉంటుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కడియం మండలంలో మొత్తం 2,623 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. ఇంకా 30 శాతానికి పైగా పంట కోతలు పూర్తి కావాల్సి ఉంది. కోసిన పంటలో 20 నుంచి 25 శాతం వరకు ఇంకా కళ్లాల్లోనే ఉన్నట్టు రైతులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు నిలిపివేసింది. ఓవైపు మారుతున్న వాతావరణంతో ఆందోళన, మరోవైపు ధాన్యం కొనేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో, దళారులకు అయినకాడికి అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుళ్ల, మురమండ, మాధవరాయుడుపాలెం, కడియం, వేమగిరి తదితర గ్రామాల్లో పలువురు రైతులు తమ పంటను కోసేందుకు వాతావరణం అనుకూలంగా మారే తరుణం కోసం ఎదురు చూస్తున్నారు. కోతలు పూర్తయిన వారు మాత్రం.. కొనేవారి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

దళారుల దోపిడీ

విపరీత వాతావరణ పరిస్థితులకు తోడు, ప్రభుత్వం కొనుగోళ్లు నిలిపివేయడంతో దళారుల దోపిడీకి తెర లేచిందని రైతులు చెబుతున్నారు. రూ.1,725కు కొనాల్సిన ధాన్యాన్ని రూ.1,400 నుంచి రూ.1,550 మధ్య అడుగుతున్నారని, ఈ లెక్కన ప్రతి ఎకరాకు రైతుకు రూ.5 వేల నుంచి రూ.8 వేలు నష్టపోవాల్సి వస్తోందంటున్నారు. తమ వద్దకు తెచ్చిన ధాన్యాన్ని మిల్లర్లు పరిశీలించి, తేమ ఉందని, నూక అయిపోతుందంటూ వంకలు పెట్టి, ధరను దారుణంగా తగ్గించేస్తున్నారని గగ్గోలు పెడుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలోకి పడిపోయారు. నిర్దిష్టమైన పర్యవేక్షణ లేకపోవడంతో మిల్లర్లు, దళారులు చెప్పిందే వేదంగా ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయని చెబుతున్నారు. ఒకే రాశిలోని ధాన్యాన్ని రెండు వేర్వేరు మిల్లులకు తీసుకువెళితే, ఒక్కో మిల్లు వద్ద ఒక్కో రకంగా ధరను నిర్ణయిస్తూ తమతో ఆడుకుంటున్నారని రైతులు వాపోతున్నారు.

యంత్రాల అద్దె కూడా..

రైతుల అసహాయ పరిస్థితిని అదనుగా చేసుకుని కోత మెషీన్ల ధరలను కూడా పెంచేశారంటున్నారు. గంటకు రూ.2,300కు కోత కోసే యంత్రం అద్దెను ప్రస్తుతం రూ.2,600 వసూలు చేస్తున్నట్టు చెబుతున్నారు. ఓవైపు ధాన్యం బస్తాకు రూ.150 నుంచి రూ.250 వరకు నష్టపోతుండగా, మరోవైపు అదనంగా మెషీన్లకు ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు వివరిస్తున్నారు. ఒకవేళ ధాన్యం నిల్వ చేసుకునేందుకు కూడా అవకాశం లేకపోవడంతో, అయినకాడికి రైతులు తమ పంటను అమ్ముకోవాల్సి వస్తోందంటున్నారు.

రూ.200 తగ్గించి అడుగుతున్నారు

ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే రూ.200కు తగ్గించి దళారులు అడుగుతున్నారు. దాదాపు 300 బస్తాల ధాన్యం నా వద్ద ఉంది. ఆ లెక్కన రూ.60వేలను నేను నష్టపోవాల్సి వస్తోంది. నిల్వ చేసుకుందామంటే ఇంకా తక్కువకు అడుగుతారేమోనన్న భయం ఉంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– బి.ఆనంద్, రైతు, దుళ్ల

కొనుగోళ్లు నిలిపివేయడం దారుణం

ప్రభుత్వం పంట నమోదు చేసుకుంది. ఇంత పంట దిగుబడి వస్తుందని అంచనా ఉంది. అయినప్పటికీ ధాన్యం కొనకుండా నిలిపివేయడం దారుణం. మరి అటువంటప్పుడు పంట నమోదు ఎందుకు చేశారు. ఇప్పుడు రైతులకు జరుగుతున్న నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారు.

– సన్నపు బ్రహ్మానందం, రైతు, దుళ్ల